# వింత చికిత్స

డిప్యూటి ఇనస్పెక్టరైన నందకిశోరరావు. అతని మిత్రుడు సింహాద్రిరావు, కొండపల్లి మేష్టరు ప్రయాణమై బోయపాడు గ్రామం పాఠశాల దరికి వచ్చేరు.

ముగ్గురు మేష్టర్లు బండిదగ్గరకి వచ్చి వంగి వంగి నమస్కారాలు చేశారు.

సింహాద్రిరావు "ఈ నక్క వినయాలకేమిటిలెండి! ఏదేనా కాస్త సిద్ధంగా వుంచేరా, లేదా?" అన్నాడు.

ఇంకా పాఠశాలలో కాలుపెట్టకుండానే ఈయనగారు "ధూం, ధాం తడాఖా" అంటున్నాడే అని ఉపాధ్యాయులు బెదిరిపోయారు.

"బాబూ! అన్నీ సిద్ధంగా వున్నాయండి!" అన్నాడు ప్రధానోపాధ్యాయుడు సాహసించి.

"ఏమిటి! మనిషి ఒక్కంటికి రెండు కాళ్ళు, రెండు చేతులు, ఒక వట్టి తలకాయి! అంతేనా? అంతకన్నా మరేమేనా వుందా?" అన్నాడు సింహాద్రిరావు.

ఈయనేదో చండశాసనుడిలా గున్నాడనుకొన్నారు ఉపాధ్యాయులు.

రెండో ఉపాధ్యాయుడు "కాస్త ఫలహారం, కాఫీ తయారుగా వుంచామండి!" అన్నాడు.

"ఆసంగతి మొదటే చెప్పరాదుటయ్యా! దానికి ఇన్ని ప్రశ్నలు వెయ్యాలా, మమ్మల్ని ఇంత వూరించాలా! ఒక్క ప్రశ్నకి సమాధానం రావడం యింతసేపా! ఇలాంటివాళ్ళంతా పిల్లలకి యేమి చదువు చెప్తారయ్యా! రేపు మిమ్మల్ని కౌంసిళ్ళకి బుక్‌చేస్తే మీరు ప్రశ్నలేమివేస్తారయ్యా!" అన్నాడు సింహాద్రిరావు.

మేష్టర్లు గ్రహించి వూరుకొన్నారు.

బడిలోకి వెళ్ళారు. బడి ఇంటిలో సామానులు చేరవేశారు.

మిత్రులిద్దరూ కాఫీ ఫలహారాలు పుచ్చుకున్నారు. పాపం! అప్పుడింక వంట చేసుకోవాలి! ఇనస్పెక్టరు కుంపటిమీద కుక్కరు పడవేశాడు

కొండపల్లి మేష్టరు బోయపాటి మేష్టర్ల చెవిలో యేదో చెప్పగా వాళ్లు "అదా సంగతి?" అని నోళ్ళు నొక్కుకుని నవ్వుకున్నారు.

అందరూ దీపంచుట్టూ కూర్చున్నారు.

"సాలుసరి పరీక్ష స్టేటుమెంట్లు సిద్ధంచేసేరుటయ్యా! పెద్దమేష్టరూ!" అన్నాడు ఇనస్పెక్టరు.

"అదెంతపనండి" అన్నాడు

ఇనస్పెక్టరు రెండు కేకలువేశాడు. "మా ఆఫీసునుంచి నెల్లాళ్ళ కిందటే మీకు సాలుసరి పరీక్ష నోటీసు పంపించడం గుర్తుపెట్టి నిద్ర పోడానికటయ్యా!" అని అరిచేడు.

"చిత్తంబాబూ!" అన్నాడు మొదటి మేష్టరు.

"ఇంకేం. ఒప్పేసుకున్నావులే!" అన్నాడు సింహాద్రిరావు.

"లేదు బాబయ్యా!" అన్నాడు ఆ మేష్టరే.

ఇనస్పెక్టరు తక్కిన ఇద్దరి పంతుళ్ళతో "మొట్టమొదట స్టేటుమెంట్లు తయారుచెయ్యండి!" అన్నాడు.

"చిత్తమండి!" అన్నారు వాళ్లు.

బత్రోతు కాంప్‌కాట్ వేశాడు. ఇనస్పెక్టరు దానిమీద విశ్రమించాడు.

ఇనస్పెక్టరుకు విశ్రాంతిభంగం జరగకుండా ఉపాధ్యాయులు మేజాబల్లని బడిసావిట్లో ఒకవారకిపెట్టారు. సింహాద్రిరావు, మేష్టర్లు అందరూ అక్కడ పోగయ్యారు.

సింహాద్రిరావు "మధ్యాహ్నం కొండపల్లి మేష్టరు తెచ్చిన కాఫీ లండన్ హోటలులో చేసినట్టుందయ్యా! అహహహా!" అన్నాడు.

"చిత్తం అయ్యగారూ! ఇంకా సిసలైన పాలు దొరికేయికావండి! దొరికితే ఎలాగుండేదో! కాస్త మేకపాలు కల్తీ అయేయండి!" అన్నాడు కొండపల్లి మేష్టరు.

"అరి కొంపతీశావు! రామ! రామ! బతికుండగా మేకపాలేసే! శిరచ్ఛేదం చేసినా నాకు నొప్పి అనిపించదయ్యా! అలాంటిపని చేశావు! నువ్వు ఈరోజున! చిన్నప్పుడేనా చదువుకోలేదుటయ్యా! 'మేకల పాడి యును రోత మేదిని సుమతీ!' అని అంటూ 'ఓక్ _ ఓక్ _ ఓక్ __' అని డోకుతెచ్చుకున్నాడు.

"అదేమిటండి బాబూ!" అన్నారు మేష్టర్లందరూ.

"మేకపాలు తాగితే మలేరియాజాడ్యం నస్తుంది! దాని శేషం కడుపులో ఉంటే, దాని అమ్మకడుపుకాల, విషంలాగు పనిచేస్తుంది! అయ్యో! వెర్రివాడా! పాలులేకపోతే, 'లేకపోయేయండి దొరగారూ!' అని మనవి చేసుకొంటావా లేక కల్తీపాలు తెస్తావా! ఎటువంటి బుద్ధిమంతులు పోగు పడ్డారయ్యా మా ప్రాణాలకి! ఏమి బోయపాడు మేష్టరూ! నువ్వు ఎటువంటి పాలు తెచ్చావు?" అని ప్రశ్నించాడు.

"ఇక్కడ మంచిపాలనే తెచ్చిఇస్తారండి. ఎవరిచ్చినా! మనం అందులో దూరిచూస్తామా! వాళ్ళపాపం వాళ్ళకే వుంటుంది పోసిపొమ్మని వూరుకుంటాం! వాళ్లు మంచిపాలే అంటే నిజమేకాబోలు అనినమ్ముతాం!" అన్నాడు పెద్దమేష్టరు.

"అబ్బాయీ! అలాగుకాదు. నీకు తెలియదు. చెప్తా. కాస్త తెలుసుకో. పాలుపితికేటప్పుడు ఆవు వెనకకాళ్ళదగ్గిర బుర్రపెట్టుకొనికూర్చుని. పాలవాడు ఏమిచేస్తున్నాడో వెయ్యికళ్ళతో కనిపెట్టి చూడాలి! రెప్పకొట్టేవంటే టోపీలోపడవేసేడన్నమాటే! తెలిసిందా!" అన్నాడు సింహాద్రిరావు.

"మాకు పై ఆఫీసునుంచి కాగితాలు వస్తూంటాయండి. 'ముందుకి గుర్తుంచుకోడంకోసం' అని రాసివుంది. ఇదీ ఆ లెక్కలలోనే వండిందండి!" అన్నాడు ప్రధానోపాధ్యాయుడు.

"అయితే ఇప్పటి మాటేమిటి?" అని అడిగాడు సింహాద్రిరావు మేకపాలను తలుచుకొంటూ.

"తమరే సెలవియ్యండి. ఏదో బీద ఉపాధ్యాయులం. మమ్మల్ని కటాక్షించాలి!" అన్నాడు కొండపల్లి వుపాధ్యాయుడు.

"ఏదో మాకూ మా పిల్లలకి ఇంత తిండిపెట్టాలండి! ధర్మప్రభువులు!" అన్నాడు రెండో ఉపాధ్యాయుడు.

"మీరూ, మీ పిల్లలూ తింటే చాలు. ఇంటిలో ఆడవాళ్ళు ఏమైపోయినా సరే! అంతేనా మీ వుద్దేశం?" అన్నాడు సింహాద్రిరావు.

"ఏలినవారు అందరినీ ఒక్కలాగే చూస్తారు, ఆ సంగతి తమ ముందు చెప్పుకోకూడదు కాని" అన్నాడు మూడో ఉపాధ్యాయుడు మొహం పక్కకి తిప్పి.

"సరే కాని కొబ్బరిపాలతో కనక కడుపంతా ఒక్కమారు కడిగివేస్తే, ఇక మేకపాల దోషం వుండదు. విన్నారా? అది దాని కొక విరుగుడు. కనక తక్షణం పసుగెత్తుకొని వెళ్ళి, కొబ్బరిబొండాం ఒకటి లంకించుకురండి. పంతుళ్ళూ! పొండి!" అన్నాడు సింహాద్రిరావు చనువుతో.

మేష్టర్లు అందరూ ఒకరిమొహం ఒకరు చూచుకున్నారు.

"ఏమి? డబ్బులు కావాలేమిటి, ఆలోచిస్తున్నారు!" అన్నాడు సింహాద్రిరావు పుత్తజేబులో చెయ్యిపెట్టి.

"అబ్బెబ్బే! అదేం కాదండి!" అన్నాడు పెద్దమేష్టరు. అని "ఈ అడివిలో కొబ్బరిబొండమేమిటి! బొండంమాట అటుంచి, కొబ్బరికాయ దొరుకుతుందా. తిరగమోతకి ఆవగింజలదగ్గిరనుంచీ ఎక్కడినుంచో తెచ్చుకుంటేగాని దిక్కులేదు" అని నిరుత్సాహంతో మాట్లాడేడు.

నడవడానికి ఎవళ్ళకీ కాళ్ళు ఆడలేదు.

సింహాద్రిరావు "అదేమిటయ్యా! పిచ్చవాళ్ళలాగు అలాగు చూస్తారేమిటి! వేటకాడు మెత్తనైతే లేడి మూడుకాళ్ళతో గెంతిందట! అలాగుంది మీకథ! ఏలాగు దొరుకుతుందో చూస్తాను కాదు నేనుకూడా!" అన్నాడు బింకంగా.

నలుగురు ఉపాధ్యాయులు కలిసి మంత్రాంగం జరిపేరు. ఆఖరికి తేలిన అంతమేమిటంటే — ఒకరి యింటిలో ఒక ఎముగు బొమగులేని కొబ్బరిచెట్టొకటివుందనీ, ఒకవేళ వుంటే దానినేదేనా వొక కాయ వుండ వచ్చునీ తేల్చారు.

"మీబడి గతి అంతా దీనిమీదే ఆధారపడివుందని తెలుసుకోండి!" అని సింహాద్రిరావు వాళ్ళని బెదరగొట్టేశాడు.

ఇక లాభంలేదని ఉపాధ్యాయులు తొందరపడారు. ముగ్గురూ యేక మనిషిలాగు పరుగెత్తుకొనివెళ్ళి, విశ్వప్రయత్నం చేసి చెట్టునున్న ఒక కాయ వూడలాగి తెచ్చారు.

సింహాద్రిరావు మొహం చేటంత అయింది "సంకల్పసిద్ధుణ్ణి అన్న మాట నిలబెట్టేరయ్యా! నా కదేచాలు. పదివేలు! దాంట్లో నీళ్ళెంతే వున్నాయి లేకపోతే లేకపోయేయి!" అన్నాడు తృప్తితో.

"కొబ్బరికాయ అంటూ పేరుపెట్టుకొని నీళ్ళు లేకపోవడం ఏమి టండి అయ్యగారూ!"

"అదంతా నిన్నెవ్వరడిగేరు, అధికప్రసంగితనం కాకపోతే! కొబ్బరికాయంటే కొబ్బరికాయే! మామిడికాయంటే మామిడికాయే! మామిడికాయలో వట్టి టెంకా, తొక్కేగాని గుంజులేని కాయ చూడలేదుటయ్యా నువ్వు! దానిపే రేమంటారోచెప్పు చూదాం?" అన్నాడు సింహాద్రిరావు.

"దానికి మన్నెంలో పేరేలేదండి!" అన్నాడు రెండో పంతులు.

"అయినా చెబుదూ ఆలోచించి" అన్నాడు సింహాద్రిరావు.

"చిత్తం తెలియదండి!" అని రెండో ఉపాధ్యాయుడు సమాధానం చెప్పేడు.

"నా మాటవిని ఆలోచిద్దూ!" అన్నాడు సింహాద్రిరావు.

"చిత్తం. తెలియదండి! తమరు చెప్పవలసిందేకాని!" అని
అతనే జవాబు చెప్పేడు.

"అంతగా తెలియకపోతే చెప్తాను విను. గుంజు వున్నా లేక పోయినా. పచ్చగావున్నా. పుల్లగావున్నా. పెద్దదిగావున్నా చిన్నదిగా వున్నా. గుండ్రంగావున్నా. కోలగావున్నా మామిడికాయని మామిడికాయే అంటారు. దానికి వేరే పేరేలేదు ఈ భూమిమీద! దీనికి ఉదాహరణగా మరొకవిషయం చెప్తాను చూడు!" అన్నాడు సింహాద్రిరావు.

ఉపాధ్యాయులు వింటున్నారు.

"ఉపాధ్యాయుడు పట్టి అడివిమనిషి అనుకో! అతన్ని ఉపాధ్యాయుడనే అంటారా, లేదా? అతను రిజిస్టరులో సంతకంచేసి జీతం పుచ్చుకొంటాడా లేదా? తీరాచూస్తే మట్టితలకాయే అనుకో, సరేగాని! ఆవిషయం అలాగుంచి పట్టి తలకాయకీ, మట్టి తలకాయకీ భేదమేమిటో చెప్పు చూదాం?" అని మూడో ఉపాధ్యాయుడివైపు సింహాద్రిరావు చూశాడు.

ఈ ప్రశ్న చాలా క్లిష్టమైనదనుకొంటూ అతను వూరుకొన్నాడు.

"ఇది నీకు తగినప్రశ్న. నువ్వుచెప్పు తలకాయిమేష్టరూ! హెడ్ మాస్టరంటే సరియైన తెలుగుపదం అదేఅంటావా? ఇంకేమి నువ్వుచెప్పు. నీకు బాగా సంబంధించిన ప్రశ్న అది" అని సింహాద్రిరావు ప్రధానోపాధ్యాయుడితో అన్నాడు.

"పట్టి తలకాయికంటె మట్టి తలకాయే నయమండి" అన్నాడు హెడ్‌మాస్టర్.

"భేష్! భేష్! బాగుంది! కాని ఎంచేత?" అని ప్రశ్నించాడు సింహాద్రిరావు.

"ఎంచేతో!" అంటూ అతను దిక్కులు చూశాడు.

రెండో ఉపాధ్యాయుడు "తమరు సెలవిస్తేగాని దాని భావం బోధపడదు. అదంతా చిక్కుసమస్యలాగుంది. మా తలకాయలన్నీ ఒకలాంటివే!" అన్నాడు.

"పేరుకిమాత్రమే తలకాయమేష్టరు! అంతేనా?" అన్నాడు సింహాద్రిరావు.

ఉపాధ్యాయులందరు వూరుకొన్నారు.

"అయితే చెప్తాను వినండి! పట్టితలకాయినిండా ఆకాశముంటుంది, మట్టి తలకాయినిండా మట్టి వుంటుంది. ఈ రెండు భూతాలలో మనకి తిండితిప్పలు పెట్టేది ఏది? నేల లేకపోతే వ్యవసాయం లేదు, తిండి లేదు. మరేం! తేటతెల్లమయిందికదా!" అన్నాడు సింహాద్రిరావు.

"చిత్తం" అన్నారు ఉపాధ్యాయులు.

ఒకమేష్టరు కొబ్బరి బొండం ఒలిచి పొడుంకాయంత కాయ బైటికి తీశాడు. దానిని చేతిలోపట్టుకొని రాతినివేసి ఎంతకొట్టినా పగలలేదు. అప్పుడు రాతితో దానిని కొట్టగా. అంచేతి దళసరిపెంకు వుంది! పైగా పెన్నెల తిన్నకాయి: ఒకటో రెండో నీళ్ళచుక్కలున్నాయి.

అదంతా సింహాద్రిరావు కంటితో చూస్తూనే వున్నాడు. "శాస్త్రానికి నీళ్ళచుక్కలుంటే చాలు నాయనా! ఏదో పెద్ద బ్రహ్మాండం చేస్తున్నావు!" అని ఒక గళాసునీళ్ళలో ఆ రెండుచుక్కలు వేసి. కలియబెట్టి. మొదట నోటిలోపోసుకొని, పుక్కిలించి ఉమ్మివేసి. నోరు శుభ్రపడిందని సంతోషించి, లోపలికి ఇన్ని పుచ్చుకొన్నాడు. "ఇది మలేరియాకి దివ్యౌషధం!" అని సంతోషించాడు.

మొత్తంమీద మాటదకి[illegible]దికదా అని ఉపాధ్యాయులు సంతోషపడ్డారు. అతని హాస్యంచూసి అందరూ ఆనందించారు.

సింహాద్రిరావు ఏదో చిన్న పనిమీద అవతలికి వెళ్ళాడు.

పెద్ద ఉపాధ్యాయుడు "అతని హాస్యం ఎంత ఇంపుగా ఉంది! ఇంతకాలంపట్టి మోటుమాటలే హాస్యమనుకొన్నాం. కాని ఈ హాస్యం ఎంత మృదువుగా ఉంది. తలుచుకొన్నాడంటే కడుపు చెక్కలయేటట్లు నవ్వవలసిందే! కాని అతనికిమట్టుకు తనలోని సుగుణం తెలియదు. అందుచేతే ఎవరేనా ఎదుట నవ్వేరంటే పులిలాగు మీదపడిపోతాడు. అడవిమల్లెలు తమ సువాసనని గుర్తించగలవా? నెమలి తన సొగసు ఎరుగునా? లేడికి తన బెదురుచూపుల సౌందర్యం తెలుసా? అందకత్తె తన అందాన్ని గమనిస్తుందా? అలాగే అతనుకూడ తన హాస్యధోరణి ఎరుగడు. పువ్వులకి తమ చక్కనిరంగులు ఏలాగు సహజలక్షణమో అలాగే అతనికి హాస్యమున్నూ" అన్నాడు.

మిగతావాళ్ళందరు 'ఔను' అన్నట్టుగా తలలు ఊపారు.

మిత్రులిద్దరూ ఆరాత్రి ఏదో కాస్త కతికి శరీరాలు పక్కలమీద వాల్చారు. పెద్దమేష్టరు వాళ్ళకి సాయంగా పడుకొన్నాడు తక్కినమేష్టర్లు ఇళ్ళకి దారితీశారు. కొండపల్లి మేష్టరు "నేను తెల్లవారుజామున బయలు

దేరి ఇంటికి పోతానండి!" అని ఇనస్పెక్టరుదగ్గర సెలవుపుచ్చుకొని, పెద్ద మేస్టరుతోపాటు ఒకమూల సాగోరేడు.